మందమర్రి : ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి రమేశ్

వాంకిడిలో ప్రారంభిస్తున్న డాక్టర్ వినయ్ ఉప్రే

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మందమర్రి, మే 16 : జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి పట్టణంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యాపల్ ఏరియాతో పాటు, వివిధ బస్తీ దవాఖానల పరిధితో పాటు, ఊరు రామకృష్ణాపూర్, పొన్నారం, క్యాతనపల్లి ప్రాంతాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రమేశ్, మండల సీహెచ్‌వో గంగాధర్, ఎంఎల్‌పీహెచ్ స్పందన, స్టాఫ్ నర్స్ రేవతి, ఫార్మాసిస్ట్ స్రవంతి, ఓపీ ఏఎన్ఎం మంజుశ్రీ, హెల్త్ అసిస్టెంట్ కుమార్, రాము, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, మే 16 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోల జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. పొన్నారంలో జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామల, గ్లోరి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి, మే 16 : వాంకిడి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ అవగాహన ర్యాలీ తీశారు. డెంగీ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని డాక్టర్ వినయ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్ఎన్ ఆర్వో సిబ్బంది, ఆశ క్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి
- నస్పూర్ సింగరేణి ప్రాణహిత స్టేడియం సందర్శన

వేసవి శిబిరంలో ఫుట్‌బాల్ శిక్షణ తీసుకుంటున్న పిల్లలతో జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, మే 16 : సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన నస్పూర్ సింగరేణి ప్రాణహిత స్టేడియాన్ని సందర్శించారు. ఇక్కడ నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని పరిశీలించి, శిక్షణ తీరు, వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న చిన్నారులతో ఆయన మాట్లాడారు. అనంతరం పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. సింగరేణి సంస్థ ఉద్యోగులకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నదన్నారు. కార్మికులు, భూ నిర్వాసితుల పిల్లలకు వేసవిలో క్రీడా శిబిరాలు ఏర్పాటు చేసి, వివిధ క్రీడాంశాల్లో నైపుణ్యాన్ని అందిస్తున్నటుల ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడి మైదానంలో కల్పించాల్సిన సౌకర్యాలను క్రీడాకారులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, డబ్ల్యూపీఎస్ జీఎం గౌరవ కార్యదర్శి సృజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో-ఆర్డినేటర్ తోట సురేశ్, ఫుట్‌బాల్ శిక్షకుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నమ్మించి ముంచిన ప్రభుత్వం

- మోసపూరిత హామీలతో రైతాంగాన్ని ఆగంజేసిన్రు
- ఏ ధాన్యమైనా రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- రైతుల పక్షాన నిలిచేది బీఆర్ఎస్సే
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- సర్కారు నిర్లక్ష్యంపై పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రాస్తారోకో..


మంచిర్యాలలో నిర్వహించిన రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ఆసిఫాబాద్ టౌన్, మే 16 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నమ్మించి నట్టేట ముంచిందని, మోసపూరిత హామీలతో ఆగం చేస్తున్నదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధ్వజమెత్తారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని ఇచ్చిన హామీని మరిచి, కేవలం సన్న రకం వడ్లకే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అనడంపై.. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ పనులను రైతులు ప్రారంభించినప్పటికీ రైతు రుణ మాఫీ చేయడంలో సీఎం విఫలమయ్యారని ఆరోపించారు. జూన్ మొదటి వారంలో అన్నదాతలకు డబ్బు అవసరం ఉంటుందని, కానీ, ఆగస్టులో రుణమాఫీ చేస్తామని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రైతులు బ్యాంకులకు పోతే పాత రుణం చెల్లించాలని అధికారులు ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. సీజన్‌కు ముందుగా రైతుబంధు ఇస్తే వారికి ఉపయోగపడుతాయని, కానీ పంటలు వేసిన తరువాత ఇస్తే ఏం లాభమని ప్రశ్నించారు. అకాల వర్షాలతో తడిసిన వడ్లను కొనుగోలు చేస్తామని ప్రకటించిన మంత్రులు.. క్షేత్రస్థాయిలో అధికారులు రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. అన్నదాతలను ఆగంజేస్తున్న కాంగ్రెస్.. రైతు వ్యతిరేక పార్టీగా నిలువనుందని విమర్శించారు. రైతులు ఏ ధాన్యం పండించినా రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్హానద్, పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రవీందర్, చిలుకూరి రవి, పట్టణాధ్యక్షుడు హైమద్, మాజీ సర్పంచులు భీమేశ్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ జలీంపాషా, నాయకులు నిసార్ షర్ఫొద్దీన్, గిరి, ఖలీద్, వెంకన్న, సుప్రజా, ఉమ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన నిలిచేది బీఆర్ఎస్సే : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో రైతుల పక్షాన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు.. నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేసి, ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల పక్షాన ముందుండి పోరాడేది కేవలం ఒక్క బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతుల కోసమే పనిచేశామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని వాగ్దానాలు చేశారని, వానకాలం, యాసంగి పంటలు చేతికొచ్చినా ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. యాసంగిలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని, కానీ, సన్న రకాలకే బోనస్ ఇస్తామని సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడంలేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందో మాట, తర్వాత ఇంకోమాట మాట్లాడడం దారుణమన్నారు. ప్రభుత్వం తీరును రైతులు గమనిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రైతులకు అన్ని విధాలా మేలుచేసే కార్యక్రమాలు చేశారని, ఎర్రటెండలో సైతం చెరువులు, కుంటలు నిండుకుండలను తలపించేవని, మత్తళ్లు దూకేవని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలోనే రాష్ట్రంలో రైతాంగాన్ని అధోగతి పాలు చేసిందని ధ్వజమెత్తారు. రైతులకు కచ్చితంగా రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని, లేకపోతే ఈ ప్రభుత్వం రైతు ఆగ్రహానికి గురవ్వక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగ తిరుపతి, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, శ్రీపతివాసు, ఎడ్ల శంకర్, నజీ రొద్దీన్, పడాల రవీందర్, సుధీర్, పెంట ప్రదీప్, రమేశ్ యాదవ్, వెంకటసాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్, మే 16 : చెన్నూర్ పట్టణంలోని బస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం సన్న రకానికే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు తుమ్మ రమేశ్, జోడు శంకర్, దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీను, వేల్పుల సుధాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బెల్లకొండ కరుణాసాగర్‌రావు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, మేడ సురేశ్‌రెడ్డి, కొండపర్తి వెంకటరాజం, జడల మల్లేశ్, పెండ్యాల లక్ష్మణ్, ఆరిఫ్, వీరమల్ల రాము, నెన్నల భీమయ్య, కొప్పుల రవి, నయాబ్, మురళి, మనోహర్, భారతి, ముత్యాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మాట్లాడుతున్న నిర్వాహకులు

నస్పూర్, మే 16 : ఉచిత విద్యతో పాటు, ఉద్యోగం కల్పించేందుకు ఈ నెల 19న మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకులు సంతోష్‌కుమార్, నవీన్‌రెడ్డి గురువారం తెలిపారు. అభినవ స్వచ్ఛంద సేవా సంస్థ, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ సింగరేణి మాస్టర్ మోటివేటర్స్, వివేకవర్ధిని విద్యాసంస్థలు సంయుక్తగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులతో పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాల కోసం 94402 43777, 80747 71108, 63032 04295 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రామానందస్వామిని సన్మానిస్తున్న పురోహితులు, భక్తులు

లక్షెట్టిపేట, మే 16 : లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పురోహితులు గొల్లపల్లి రామానందస్వామికి విశ్వవాస్తు జ్యోతిష్య రత్న అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల ఐఖ్య వేదిక ఆధ్వర్యంలో వేద పండితుడు, పురోహితుడు డాక్టర్ రామడుగు నరసింహాచార్యుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కాగా, ఆయను గురువారం ఆలయంలో తోటి పురోహితులు, భక్తులు ఘనంగా సన్మానించారు. పురోహితులు శ్రీధరాచార్యులు, ప్రభాకర్, నిమ్మ రత్నాకర్, అశోక్, కుమారస్వామి, గోపాల్, శివ, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

రైతుకు బహుమతి అందిస్తున్న మహికో కంపెనీ ప్రతినిధులు

సిర్పూర్(టీ), మే 16 : మహికో కంపెనీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో గురువారం పత్తి పంటపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహికో కంపెనీ రీజినల్ మేనేజర్ సచిన్ జాదవ్ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు వాడడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం పత్తి రైతులకు చీడపీడలు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. కంపెనీకి చెందిన రెండు కొత్త రకమైన 7351 గోల్డ్, మహారాజా హైబ్రిడ్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లు, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

నస్పూర్, మే 16 : మంచిర్యాల పట్టణంలోని అభ్యాస పాఠశాల విద్యార్థులు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. పట్టణంలోని టీ కన్వెన్షన్ హాలులో గురువారం పాఠశాల ప్రిన్సిపాల్, సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవర్ గ్రహీత విద్యాభూషణ్ సాన సుధతి ఆధ్వర్యంలో 200 మంది (5-12 ఏండ్లలోపు) విద్యార్థులకు వెయ్యి పదాలను (3-12 లెటర్ పదాలు) వెయ్యి సెకండ్లలో గుర్తించి పలికేలా తీర్చిదిద్దారు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల చైర్మన్ సాన వెంకటేశ్వర్ రావు, కరస్పాండెంట్ సాన గిరీశ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్‌తో సాన సుధతి

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సాయం

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

తాండూర్, మే 16 : తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పంబాల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం రూ.1.91లక్షల (కుటుంబ భరోసా సహాయం రాష్ట్ర సంఘం నుంచి రూ.1.55లక్షలు, మంచిర్యాల జిల్లా సంఘం నుంచి రూ.16 వేలు, మండల సభ్యుడు సుధాకర్ రూ.10 వేలు) చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు నల్ల సతీశ్, తాండూర్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు తిరుపతి, సబ్బని శ్రీనివాస్, రుకుం ప్రసాద్, మహంకాలి కృష్ణమూర్తి, సత్యనారాయణ, రమేశ్, మోయిన్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పనుల పరిశీలన

మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

దండేపల్లి, మే 16 : దండేపల్లి మండలం ద్వారక జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు శ్రీరాములపల్లె పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల విద్యాధికారి రవీందర్ గురువారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం చిన్న నర్సయ్య, హెచ్ఎం సౌజన్య, సీఆర్పీ ఇప్ప సురేందర్, సిబ్బంది ఉన్నారు.

జూన్ మొదటి వారంలోగా పనులు పూర్తి చేయాలి

ప్రాజెక్టు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాస్

కడెం, మే 16 : కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆయకట్టు సీఈ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. యాసంగిలో నీరందక పంటలు నష్టపోయిన రైతులకు తిరిగి వానకాలం నాటికి ప్రాజెక్టును సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐదు గేట్ల పనులను వేగవంతం చేయాలని, గడిచిన రెండేళ్లలో గేట్లు తెరుచుకోని కారణంగా ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోను బయటకు గేట్ల ద్వారా వదలేక ముప్పు పొంచి వచ్చిందని, ఈ ఏడాది అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే స్కాడా పనులను పరిశీలించారు. ఈ వానకాలం పంటకు నీటిని అందించడంతోపాటు, ఆలోగా మరమ్మతులు పూర్తయ్యేలా పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈ మధూసుదన్, ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, డీఈ భోజదాస్ పాల్గొన్నారు.

వైద్యులను అవమానించేందుకే

టీఎస్ఎంసీ ద్వారా దాడులు

- అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

మాట్లాడుతున్న అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

మందమర్రి, మే 16 : మంచిర్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్న అనుభవ వైద్యులను అవమానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) విజిలెన్స్ పేరిట ప్రాథమిక వైద్యశాలలపై దాడులు నిర్వహిస్తున్నదని ఆ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆరోపించారు. టీఎస్ఎంసీ దాడులను నిరసిస్తూ మందమర్రి మండల పరిధిలోని అనుభవ వైద్యులతో స్థానిక సంఘం కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమకు శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నదని తెలిపారు. దానిని అమలు చేయకుండా దాడులు చేయించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి జోక్యం చేసుకొని టీఎస్ఎంసీ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగు రవీందర్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, కోశాధికారి అయిల్ల లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద తిరుమల్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గోనె గోవర్ధన్, ఉపాధ్యక్షుడు సీహెచ్ పోషం, ప్రకాశ్‌రావు, ఒడ్నాల సత్యనారాయణ, అజీజ్, లక్ష్మణ్(చెన్నూర్), మంథెన రమేశ్(లక్షెట్టిపేట), లక్ష్మణ్(బెల్లంపల్లి) తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో సమావేశం..

సీసీసీ నస్పూర్, మే 16: మంచిర్యాల జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్, నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారుల (టీఎస్ఎంసీ) ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో తమ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. దాడులనువెంటనే నిలిపివేయాలని ఆ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ మొగిలి, ప్రధాన కార్యదర్శి రాంచందర్, గౌరవ అధ్యక్షుడు ధనుంజయ డిమాండ్ చేశారు. అప్పటి వరకు వైద్య సేవలు నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రొడ్డ రాజేశం, కోశాధికారి రామన్న, సీసీసీ, శ్రీరాంపూర్ ప్రాంత ఆర్ఎంపీ, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్ : సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

సాఫ్ట్‌బాల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

బెజ్జూర్, మే 16 : బెజ్జూర్ మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో గురువారం సాఫ్ట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను ఎంపీటీసీ పర్వీన్ సుల్తానాతో కలిసి జడ్పీటీసీ పంద్రం పుష్పలత ప్రారంభించారు. వారు మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా క్యాంపులను నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు క్రీడా ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు. ఈ క్యాంప్ కోసం కృషిచేసిన కేజీబీవీ పీఈటీ చెంచు లక్ష్మి, సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్‌ను వారు అభినందించారు. ఈ సాఫ్ట్‌బాల్ క్రీడలను మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోకె వెంకన్న, జావీద్ అలీఖాన్, తంగిడిపల్లి మహేశ్, కొట్రంగి రామకృష్ణ, ఉపాధ్యాయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

తాండూర్, మే 16 : తాండూర్ సబ్ స్టేషన్ పరిధి మాదారం, పోచంపల్లి, నీలాయిపల్లి, అబ్బాపూర్, బెజ్జాల, నర్సాపూర్, రేపల్లెవాడ, బోయపల్లి బోర్డు, ఐబీ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఏఈ బీ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీ, మాదారం 11కేవీ మరమ్మతుల కారణంగా ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న అధ్యక్షుడి ఎన్నికకు సమావేశం

సిర్పూర్(టీ), మే 16 : సిర్పూర్(టీ) మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల ఎంపికకు ఈ నెల 24న ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల ఎన్నిక కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కాగజ్‌నగర్ ఆర్డీవో ఆధ్వర్యంలో అధ్యక్షుల ఎంపికకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంబలి పంపిణీ

లక్షెట్టిపేట, మే 16 : పట్టణంలోని ఊత్కూర్ వారసంతలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు ఉచిత అంబలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బుసి రెడ్డి శంకర్, చార్టెడ్ ప్రెసిడెంట్ బాశెట్టి చంద్రగుప్త, ప్రెసిడెంట్ వొజ్జల శ్రీనివాస్, సెక్రటరీ పల్లెర్ల మనోహర్, ట్రెజరర్ బోనగిరి కిషన్, సభ్యులు సురేశ్, రమేశ్, శ్రీనివాస్, సతీశ్, గంగాధర్, అంజన్న, కిరణ్, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కవ్వాల్ గ్రామంలో గుడుంబాను పట్టుకున్న ఎక్సైజ్ అధికారి గంగారెడ్డి, సిబ్బంది

జన్నారం, మే 16 : జన్నారం మండలం కిష్టాపూర్, కామన్‌పెల్లి, కవ్వాల్, బంగారుతండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ డివిజన్ అధికారి గంగారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో దాడులు నిర్వహించారు. అజ్మీరా అమృతబాయి, భూక్యా లక్ష్మణ్, నందు, పసుపతి బుచ్చవ్వ నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, కేసులు నమోదు చేసినట్లు గంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ నర్సింహులు, ఎస్‌హెచ్‌వో సిబ్బంది ఏ శ్రీనివాస్ రెడ్డి, అర్ సాగర్, డీ వెంకటేశ్, ఎం సుజాత పాల్గొన్నారు.

ఐకే ఓసీ సందర్శన

గనిని సందర్శిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

జైపూర్, మే 16 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని గురువారం ఐఎన్టీయూసీ నాయకులు సందర్శించారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు ఆధ్వర్యంలో కార్మికుల పని స్థలాల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్వారీ లోపలికి వెళ్లేందుకు వెహికిల్ సౌకర్యం కల్పించాలని, పని స్థలాల వద్ద రెస్ట్ సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కార్మికులు వాపోయారు. క్యాంటీన్, వాష్‌రూంల సౌకర్యం లేదని నాయకులకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు కలవేన శంకర్, కాల్వ శ్రీనివాస్, ఎం సుధాకర్, జీ మల్లేశ్, పిట్ సెక్రటరీ రాంచందర్‌నాయక్, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.